జాతీయ లోక్ అదాలత్ 2305 కేసులు రాజీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో 2305 కేసులు రాజీ అయ్యాయని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా చాలా త్వరితంగా పలు కేసులు పరిష్కారమయ్యాయని, ఎక్కువ కేసులు రాజీ అయ్యాయని తెలిపారు. ఈ అదాలత్‌లో 2305 కేసులు జిల్లా మొత్తం మీద రాజీ అయ్యాయని, దీనిలో సివిల్ కేసులు 104లకు గాను రూ.6,83,10,419లు, 2174 క్రిమినల్ కేసులకు రూ.52,81,673లు, 27 ప్రీ లిటిగేషన్ కేసులకు రూ.11,93,300లతో రాజీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.





నిలువెల్లా నిర్లక్ష్యమే

నేడు హిందీ భాషా దినోత్సవం. టీచర్ల భర్తీ, ఇతర అంశాలపై సర్కారు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

8లో

న్యూస్‌రీల్

డీఈఓగా రవిబాబుకు పూర్తి అదనపు బాధ్యతలు



రవిబాబు

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారిగా రవిబాబుకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఈఓ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న రవిబాబును ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఈఓగానే కొనసాగించారు. ఈయనకు బీఈడీ డిగ్రీ లేకపోవడంతో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించలేకపోయారు. రెండు రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో రవిబాబు ఉత్తీర్ణులు కావడంతో పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించడానికి మార్గం సుగమం కాగా, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది.

కొత్తమ్మ తల్లి జాతరలో వీడియో పోటీలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతర ఈ నెల 23 నుంచి 25 వరకు ఘనంగా జరగనుంది. ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా వీడియో పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి మార్లెళ్ల వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారి వైభవం, చరిత్ర, గత ఉత్సవాల జ్ఞాపకాలు అన్ని విషయాలను ప్రతిబింబించేలా 3 నుంచి 5 నిమిషాల నిడివి గల వీడియోలు రూపొందించాలని తెలిపారు. వీటిని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాయి కుమార్‌కి ఈ మెయిల్ drdosrikakulam@apssdc.in ద్వారా ఈనెల 16వ తేదీ లోగా వీడియోలు పంపాలని తెలిపారు. మొదటి ముగ్గురు విజేతలకు రూ.5,000 రూ.3,000, రూ.2,000 నగదు బహుమతులు అందజేయనున్నారని తెలిపారు. ఈ నెల 23న ఉదయం 8–9 గంటలకు ఆలయం వద్ద కర్టెన్ రైజర్ ప్రోగ్రాం, 23, 24 తేదీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో గ్రామీణ క్రీడలు, 24న మధ్యాహ్నం 3–5 గంటల వరకు కొత్తపేట జంక్షన్ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర, 23–25 తేదీల్లో సాయంత్రం 6–11 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 25న రాత్రి 7–9 గంటల వరకు క్రాకర్స్ షో, జాతర మూడురోజులూ ఎగ్జిబిషన్ స్టాల్స్ అలరించనున్నాయి. హెలికాప్టర్ రైడ్ ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని, ప్రజలందరూ పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.



వైఫల్యాలపై ప్రశ్నిస్తే కేసులా..?



ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని కూటమి అణగదొక్కుతోంది. జర్నలిస్టు గొంతు నొక్కడం చేతగాని రాజకీయాలకు నిదర్శనం. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదు. – రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే

మీడియాపై కేసులా..?



ప్రభుత్వాన్ని ప్రశ్నించే మీడియాపై కేసులు వేయడమంటే ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడమే. ప్రజాస్వామ్యంలో నాల్గోస్తంభంగా ఉన్న మీడియా హక్కులను కాలరాసే హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారు. ఇది భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించడమే.
– గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే


ఆకాశలక్కవరంలో ఎరువుల కోసం కొట్టుకుంటున్న దృశ్యం



మంత్రి వర్యా... దీన్నేమంటారు..?

"ఎరువుల సమస్య లేదు. అంతా స్ట్రీమ్‌లైన్‌లోకి వచ్చేసింది. ఎరువులుండటం వల్లనే క్యూలు ఉంటున్నాయి. రైతులకు యూరియా అందడం లేదన్న పరిస్థితి లేదు. తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఏమని సమాధానం చెప్పాలి. - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలివి.

- అసలు ఎరువుల సమస్యే లేదని తేల్చి చెప్పేస్తున్న వ్యవసాయ మంత్రి
- మీడియాది తప్పుడు ప్రచారమంటూ బుకాయింపు
- తాజాగా అచ్చెన్న సొంత నియోజకవర్గంలోనే ఎరువుల కోసం కొట్లాట
- దీనికి మంత్రి ఏం సమాధానం చెబుతారని రైతుల ప్రశ్న





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఎంతగా కవర్ చేయాలని ప్రయత్నిస్తున్నా ఎరువుల కొరత తీవ్రత ఏదో రూపంలో బయట పడుతూనే ఉంది. ఏకంగా ఆయన సొంత నియోజకవర్గంలో ఎరువుల కోసం ఏకంగా కొట్టుకోవడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సంతబొమ్మాళి మండలం ఆకాశలక్కవరం గ్రామానికి వచ్చిన అరకొర యూరియాను కొనుగోలు చేసుకోవడానికి రైతులంతా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద క్యూ కడితే, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌ను టీడీపీ నాయకులు ఓ అమ్మవారి గుడి దగ్గరకి తీసుకెళ్లి, స్లిప్పులు ఇచ్చిన వారికి పంపిణీ చేయించేందుకు ప్రయత్నించారు. పంచాయతీ దగ్గర రైతులంతా ఉంటే, ఇక్కడ పంపిణీ చేయడమేంటని రైతులంతా తిరగబడ్డారు. గొడవ ముదరడంతో ఎస్ఐ వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. ఏ ఒక్క రైతుకు ఒక్క యూరియా బస్తా ఇవ్వలేదు. ఎరువుల కొరత లేనే లేదని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించిన కొద్ది సమయానికే ఈ ఘటన జరగడంతో ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలని రైతులు అచ్చెన్నను డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల ఆందోళనలు..

రైతు సేవా కేంద్రాల వద్ద ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఏకంగా వ్యవసాయ శాఖ సిబ్బంది రోడ్డెక్కుతున్న వైనాలు జిల్లా జనాలు చూస్తూనే ఉన్నారు. ఏకంగా కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. తక్కువ స్టాక్ రావడం వల్ల రైతులు తమను చుట్టుముట్టి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని బహిరంగంగా వాపోయారు. అంతేకాదు మరో ఆసక్తికర విషయాన్ని కూడా బయటపెట్టారు. రైతు సేవా కేంద్రాలకు వచ్చిన ఎరువులను దాచి, తమకి వ్వాలని ఒత్తిడి చేస్తున్నారని కూడా బహిరంగంగా తెలిపారు. 100 బస్తాలు దాచి ఇవ్వకపోతే సస్పెన్షన్లు, డిప్యూటేషన్లు, బెదిరింపులకు దిగుతున్నారని కలెక్టరేట్ నిరసనలోనే మీడియా ముందు వెల్లడించారు. అంతకంటే దారుణం మరొకటి చెప్పారు. తీసుకున్న ఎరువులకు డబ్బులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు సొంత జిల్లాలోనే జరిగింది. ఆయన నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.



ఒక్కటే దరఖాస్తు

- స్పందన కరువవడంతో బార్‌లకు మళ్లీ రీ–నోటిఫికేషన్
- దరఖాస్తు గడువు ఈనెల 17కు పొడిగింపు.. డ్రా 18న



శ్రీకాకుళం క్రైమ్ : ప్రైవేటు టెండర్‌దారుల లైసెన్సు ఫీజులతో ఆదాయం సమకూరుతుందన్న ఆశ.. ప్రభుత్వాన్నే కాదు ఎక్సైజ్ శాఖకు సైతం షాకులిస్తోంది. బార్లకు టెండరుదారుల నుంచి మూడు సార్లు దరఖాస్తులు కోరినా స్పందన మాత్రం రావడం లేదు. మొదటిసారి 19 బార్లకు రెండు సార్లు నోటిఫికేషన్ విడుదల చేయగా కేవలం ఐదు బార్లకు 22 దరఖాస్తులే వచ్చాయి. మిగతా 14 బార్లకు ఈనెల 15న డ్రా తీస్తారన్నా ఇప్పటికి ఒక్కటంటే ఒక్క దరఖాస్తే (ఇచ్ఛాపురం) చేరడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. ఓ వైపు టీడీపీ పెద్దలు డ్రా జరగకుండానే లోపాయికారీగా తక్కువ సొమ్ముతోనే తమ వాళ్ల షాపులు దక్కించుకోవాలని బలంగా మనసులో పెట్టుకున్నారు. పైకి మాత్రం అధికారులపై దరఖాస్తులు ఎక్కువ పడేటట్లు చూడాలని, మళ్లీ మళ్లీ నోటిఫికేషన్లు ఇవ్వండంటూ ఒత్తిడి తెస్తున్నారు. దాని ఫలితమే ఈనెల 18న డ్రా తీయడానికి ప్రభుత్వం మళ్లీ ఉత్తర్వులు ఇచ్చింది. ఈనెల 17 దరఖాస్తులకు స్వీకరణ గడువుగా తేల్చింది.

దుకాణాలపై మోజు పడి మరీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సొంతంగా మద్యం దుకాణాలను నడిపి ప్రైవేటు వ్యాపారుల కడుపు కొట్టిందని ఎన్నికల్లో విమర్శలు ఎక్కుపెట్టిన కూటమి ప్రభుత్వం.. అవే మద్యం దుకాణాలను ప్రైవేటు టెండరుదారులకు కట్టబెట్టాలనుకుంది. ఈ విధానంలో దరఖాస్తు ఫీజు, లైసెన్సు ఫీజుల్లో దండిగా ఆదాయాన్ని సమకూర్చుకుంది. వ్యాపారులు సైతం దండిగా సంపాదించవచ్చనే ఆశతో లైసెన్సులు పొందేందుకు ఎగబడ్డారు. గత ఏడాది అక్టోబరులో జనరల్ కేటగిరీలో 158 ప్రైవేటు లైసెన్సు దుకాణాలకుగాను 4671 దరఖాస్తులు, గీతకులాలవారికి (రిజర్వ్ కేటగిరీలో) 18 దుకాణాలకు 203 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దుకాణానికి దరఖాస్తు రుసుమే రూ. 2 లక్షలు కాగా మొత్తంగా రూ. 4.06 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఇక లైసెన్సు ఫీజైతే 158 దుకాణాలకు (ఒక్కో దుకాణానికి రెండేళ్ల లీజుకు గాను రూ. 65 లక్షలు) రూ. 102 కోట్ల పైనే రాబడి వచ్చింది. రిజర్వ్ కేటగిరీలో దాదాపు రూ. 6 కోట్లు.. మొత్తం పైన రూ. 108 కోట్ల దక్కించుకుంది.

బార్ల లైసెన్సు పొందేందుకు అనాసక్తి..

బార్ల లైసెన్సు పొందేందుకు న్యూట్రల్‌గా ఉన్న వ్యాపారుల నుంచి అనాసక్తి కనిపిస్తోంది. ముఖ్యంగా దరఖాస్తు ఫీజు, లైసెన్సు ఫీజులకే ప్రభుత్వం కక్కుర్తి పడుతుంది తప్ప మార్జిన్ 20 శాతం పెంచకపోవడం ఓ కారణంగా కనిపిస్తోంది. ఒకవేళ షాపు దక్కించుకున్నా తమ చేతిలో ఉంటుందో.. టీడీపీ నాయకుల సిండికేట్ చేతికి వెళ్తుందో అన్న అనుమానం కూడా మరో కారణంగా తెలుస్తోంది.

రైల్వే గేటు మూసివేత నేడు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ పరిధి ఊసవానిపేట గేటు ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసి వేయనున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉర్లాం–శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ల మధ్యలో ట్రాక్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున గేటు మూసి వేస్తున్నామని తెలిపారు.

సచివాలయంలో ఎరువుల బస్తాలు చోరీ



తెంబూరు గ్రామస్తులు పట్టుకున్న రెండు యూరియా బస్తాలు

పాతపట్నం: తెంబూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి రెండు బస్తాల యూరియాను దొంగతనంగా తీసుకువెళుతుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం తెంబూరు గ్రామ సచివాలయానికి 220 బస్తాలు రావడంతో సచివాలయంలో యూరియా బస్తాలను సచివాలయం వీఏఏ దింపించారు. శుక్రవారం అర్ధరాత్రి సచివాలయం ఉద్యోగులు తాళాలు తీసి రెండు యూరియా బస్తాలను ఓ వ్యక్తికి ఇచ్చారు. ఆ వ్యక్తి బైక్‌పై యూరియా తీసుకెళ్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. దీంతో అతడు రెండు యూరియా బస్తాలు అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఇలా అర్ధరాత్రి బయట వ్యక్తులు బస్తాలు తీసుకెళ్లడమేంటని రైతులు ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ఏఓ కిరణ్‌వాణి వద్ద ప్రస్తావించగా తమ దృష్టికి రాలేదన్నారు.

సిక్కోలుకునేదెలా..?



- జిల్లాలో వీధివీధికీ వ్యాపించిన జ్వరాలు
- తీవ్రంగా ఒంటి నొప్పులు
- పట్టించుకోని పాలకులు
- కానరాని సర్వేలు

అరసవల్లి: పల్లె పల్లెనా, వీధివీధినా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ గడప తొక్కినా ఒకరిద్దరు జ్వర బాధితులు కనిపిస్తున్నారు. అయితే ఎక్కడా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల చర్యలు కానరావడం లేదు. వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరుతున్న రోగులను పెద్దగా పట్టించుకోకపోవడంతో అప్పులు చేసి మరీ ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వానికి ఇబ్బందులు రాకుండా జ్వర బాధిత రోగుల సంఖ్యను నివేదికల్లో తక్కువగా చూపించాలంటూ.. ఇటీవల అధికార పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు అధికారులకు హుకుం జారీ చేయడం పాలకుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

ఒంటి నొప్పులు తీవ్రం..

జ్వరాలతో పాటు కీళ్ల నొప్పులు, ఒంటి నొప్పులు చాలా తీవ్రంగా ఉండడం ఇప్పుడు జిల్లాలో కనిపిస్తోంది. జిల్లాలో 30 మండలాల్లో సుమారు 6 లక్షల ఇళ్లుంటే కనీసంగా చూసినా పది వేలమందికి పైగానే జ్వర పీడితులు ఉన్నట్లుగా చెప్పవచ్చు. అయినప్పటికీ జిల్లా వైద్య శాఖ లెక్కల ఆధారంగా చూస్తే ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 31 వరకు కేవలం 31 మాత్రమే మలేరియా కేసులు, 5 మాత్రమే డెంగీ కేసులు, చికెన్‌గున్యా కేసులు 2 వరకు మాత్రమే నమోదైనట్లు పేర్కొన్నారు. అయితే వాస్తవ లెక్కల ప్రకారం చూస్తుంటే మలేరియా కేసులు వందకు పైగా ఉన్నాయని, వివిధ రకాల వైరల్ ఫీవర్ల బాధితులు సుమారు 4 వేల మందికి పైగా ఉన్నట్లుగా సమాచారం.

సర్వేలన్నీ గారడీలే..

జిల్లాలో మలేరియా నియంత్రణ విభాగం జ్వరాల శాంపిల్స్‌ను సేకరించే బాధ్యత నిర్వర్తిస్తుంది. జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకు సర్వే అంకెలు పైన పేర్కొన్న విధంగా ఉన్నాయి. అయితే ఈనెల మొదటి వారంలోనే సుమారు 18 వేల శాంపిల్స్ తీసుకుంటే 2 వేల మందికి పైగా జ్వర పీడితులు మంచాన పడినట్లుగా తెలుస్తోంది. ఇక శాంపిల్స్‌కు దూరంగా ఉన్న వారి లెక్కను అదనంగా చేర్చితే సంఖ్య ఏడెనిమిది వేలకు చేరుకున్నా ఆశ్చర్యం కలగకమానదు.

పీహెచ్‌సీల పరిధిలో నమూనాల సేకరణ



జిల్లాలో జ్వరాల వ్యాప్తి నివారణకు గట్టి చర్యలు చేపడుతున్నాం. ఇంటింటికీ ప్రతి 15 రోజులకొకసారి హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంల బృందం విజిట్ చేసి శాంపిల్స్ సేకరణ చేపడతారు. ప్రామాణిక పరీక్షల నిర్ధారణ అనంతరం జ్వరాలను గుర్తిస్తాం. అలాగే పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ సర్వేలు చేపడుతున్నాం. మెడికల్ ఆఫీసర్లకు నిత్యం టెలికాన్ఫరెన్స్ ద్వారా సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నాం. – డాక్టర్ కె.అనిత, డీఎంహెచ్ఓ

చర్యలేవీ..?

జిల్లాలో గత నెల నుంచి నేటి వరకు విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల తీవ్రత అధికమై జ్వరాల బారిన పడిన వారి సంఖ్య వందల్లో ఉంది. అలాగే వర్షాల కారణంగా కాలువల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ పరిసరాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. అయితే పల్లెల నుంచి మున్సిపల్ కార్పొరేషన్ వరకు ఎక్కడా పారిశుద్ధ్య మెరుగు చర్యలు పెద్దగా చేపట్టలేదు. నగరంతో పాటు పలు పట్టణ ప్రాంతాల్లో కాలువల్లో షిల్టు తీసినప్పటికీ తాజా వర్షాలతో మళ్లీ యథాస్థితికి చేరాయి. వైద్యశాఖ తరఫున మాత్రం దోమల నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా 5 లక్షల వరకు గంబూషియా చేపలను వేయించేలా చర్యలు ప్రారంభించినప్పటికీ అదంతా ప్రచార ఆర్భాటంగా మార్చారు. దీంతో ఇప్పటి వరకు కనీసం లక్ష వరకు కూడా గంబూషియా చేపలను నీటి వనరుల్లో వేయలేకపోయారు.

కానరాని సర్వేలు

జిల్లాలో వైద్యారోగ్య శాఖ తరఫున క్షేత్ర స్థాయిలోనే జ్వరాలు, సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తమై ఇంటింటి సర్వేలు చేపట్టాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామ/వార్డు సచివాలయాలతో పాటు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి జ్వర పరీక్షలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యశాఖ చర్యలపై, ప్రజారోగ్యంపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. దీంతో తాజాగా సీజనల్ వ్యాధుల తీవ్రత అధికమైంది.



కొత్తూరు సీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న రోగులు

నిరీక్షణ.. నిరాశ

నిరీక్షణలు.... నిరాశలు.. నిట్టూర్పులు.. వాగ్వాదాలు యూరియా పంపిణీ కేంద్రాల వద్ద కనిపిస్తున్న దృశ్యాలివి. స్లిప్పు కావాలన్నా, ఎరువు తీసుకోవాలన్నా రైతులైను కట్టక తప్పని పరిస్థితి. గంటల తరబడి వేచి ఉంటే గానీ బస్తా ఎరువు దొరకడం లేదు. ఏ ఊరు చూసినా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి.

పడిగాపులు..

గార: అంపోలు పంచాయతీ చల్లపేట ప్రైవేటు డీలర్ వద్దకు శనివారం యూరియా రావడంతో రైతులు క్యూలో పడిగాపులు కాశారు. ఎక్కువ మంది రైతులు అక్కడకు చేరుకోవడంతో గందరగోళం చోటుచేసుకుంది. ఉదయం నుంచి కాపలా కాసినా దొరకడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



చల్లపేట ప్రైవేటు దుకాణం వద్ద రైతులు

అష్టకష్టాలు

పాతపట్నం: మండలంలోని రైతులు యూరియా కోసం అష్ట కష్టాలు పడుతున్నారు. శనివారం మండల కేంద్రం పాతపట్నం మన గ్రోమోర్‌కు యూరియా వచ్చిందని రైతులకు తెలియటంతో ఒకేసారి పాతపట్నం, బూరగాం, సీతారాంపల్లి, బోరుబద్ర గ్రామాలకు చెందిన రైతులు వచ్చి బారులు తీరారు. దీంతో ఏవో కిరణ్ వాణి, ఏఈవో టి.భారతి చేరుకుని టోకెన్ ద్వారా యూరియా అందజేసి, మరో రెండు రోజుల్లో 8.5 మెట్రిక్ టన్నులు వస్తుందని, అందని రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు.



పాతపట్నం: పాతపట్నం మన గ్రోమోర్ వద్ద టోకెన్ల కోసం బారులు తీరిన రైతులు

వాగ్వాదం



రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

సారవకోట: మండలంలోని వాండ్రాయి సచివాలయం పరిధిలో యూరియా కోసం శనివారం రైతులు అగచాట్లు పడ్డారు. ఈ సచివాలయం పరిధిలోని వాండ్రాయి, కొమ్ముసరియాపల్లి రైతులు యూరియా కోసం ఉదయం నుంచి రైతు సేవా కేంద్రంలో నిరీక్షించారు. ముందుగా టోకెన్లు ఇచ్చి పంపిణీ చేసేందుకు ప్రయత్నించినా రైతులు అధికంగా ఉండటంతో సిబ్బందితో రైతులు వాగ్వాదానికి దిగారు.

క్యూ కట్టారు

బూర్జ: ఉప్పినివలస, పాలవలస గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల కోసం రైతులు క్యూలో నిరీక్షించారు. శనివారం ఎరువుల అందజేస్తారనే ముందస్తు సమాచారంతో ఇలా క్యూ కట్టారు. రైతులందరికీ విడతల వారీగా ఇస్తామని ఏఓ ఉషారాణి తెలిపారు.



ఉప్పినివలస రైతు సేవా కేంద్రంలో ఎరువుల కోసం క్యూలో ఉన్న రైతులు

క్లుప్తంగా

నేడు ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రాక

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణకు జిల్లా కార్యవర్గం ఆదివారం ఆత్మీయ సత్కారం చేయనుందని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంత్ సాయిరాం, చల్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా జెడ్పీ గేట్ నుంచి సమావేశ మందిరం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఉద్యోగవర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

పూర్తి అవగాహనతో వైద్యం అందించాలి


వైద్యులకు సూచనలిస్తున్న డాక్టర్ గౌతమ్

అరసవల్లి:గ్రామీణ ప్రాంతాల్లో కచ్చితంగా పూర్తి అవగాహనతోనే వైద్యం అందించాలని గ్లోబల్ న్యూరో కేర్ అధినేత డాక్టర్ దేవరెడ్డి గౌతమ్ సూచించారు. వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా శనివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గ్లోబల్ న్యూరోకేర్ ఆసుపత్రిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పల్లెల్లో మితిమీరిన వైద్యం, మందుల వినియోగాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి వారికి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శిష్టు అనిల్, బండి గౌతమ్, గీతాప్రియదర్శిని, మార్కెటింగ్ హెడ్ సీహెచ్ స్వామి, రెడ్‌క్రాస్ మేనేజర్ రమణ పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో 5 కేజీల గంజాయితో ముగ్గురు పట్టుబడ్డారని డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయం వద్ద శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకి చెందిన ముత్తుకుమార్, ఉదయ్‌కుమార్, ముత్తురామలింగంలు 5 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. తమిళనాడు రాష్ట్రం తిరుప్పూరుకు చెందిన గంజాయి వ్యాపారి పాండ్యరాజు సూచన మేరకు ఒడిశా రాష్ట్రం మోహన బ్లాక్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి బస్సు ద్వారా ఇచ్ఛాపురం చేరుకొన్నారు. అనంతరం రైలులో తమిళనాడు వెళ్లేందుకు బయలుదేరగా పోలీసులు పట్టుకున్నారు. వీరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కి తరలించారు. వీరి వద్ద నుంచి గంజాయి, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలో గంజాయిని విక్రయించిన కుమార్, గంజాయిని తీసుకురావాలని సూచించిన పాండ్యరాజ్‌పైనా కేసులు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సై ముకుందరావు, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

రణస్థలం: లావేరు మండలం బొంతుపేట శ్మశానవాటిక వెనుక ఉన్న పొలంలో సుమారు 65 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతదేహం పక్కనే చేతి కర్ర ఉందని, వివరాలు తెలిసిన వారు 63099 90851 నంబరుకు తెలియజేయాలని లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు కోరారు.

హిందీ భాషాభివృద్ధిపై..

నిలువెల్లా నిర్లక్ష్యం


హిందీ దివాస్ సందర్భంగా 'అ' అక్షరంతో విద్యార్థుల సమూహం(ఫైల్)

- టీచర్ల భర్తీ, ఇతర అంశాలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం
- రాజభాషకు ప్రోత్సాహం కరువు
- నేడు జాతీయ హిందీ దివాస్

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం కల్చరల్: జాతీయ భాష హిందీపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. హిందీ భాషాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడంలేదు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో హిందీతోపాటు లాంగ్వేజ్ టీచర్లను సైతం నియమించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్ సీపీ పాలనలో హిందీ భాషాభివృద్ధికి పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. హిందీ సబ్జెక్ట్ టీచర్లు పాఠశాలల్లో ఉండేలా జాగ్రత్తలు చేపట్టారు. గత డీఎస్సీలో హిందీ పోస్టులను సైతం భారీగా భర్తీ చేశారు. ప్రస్తుతం హిందీ భాష పట్ల, హిందీ ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యమని పలువురు భాషాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రాజభాషగా హిందీని ప్రోత్సహించాలని హిందీమంచ్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి పక్షోత్సవాలు..

ఈ నెల 14న జాతీయ హిందీ దివాస్ సందర్భంగా.. ఆదివారం నుంచి పక్షోత్సవాలను నిర్వహించేందుకు సన్నద్ధమౌతున్నారు. ఆదివారం నుంచి 28వ తేదీ వరకు 15 రోజులపాటు ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లో, ప్రతి జిల్లాలో ఐదు రోజులపాటు హిందీ దివస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మంచ్ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కోనే శ్రీధర్ నేతృత్వంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. హిందీ ఫోరం, హిందీ వికాస వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులను హిందీపై ఆసక్తిపెంచేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేలా కసరత్తులు చేశారు. మరోపక్క హిందీ సులేఖన్ పోటీలను పోటీలను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించారు.

డిమాండ్లు ఇవే..

- హైస్కూళ్లలో హిందీ పండింట్ల సంఖ్యను పెంచాలి.
- ప్రైవేటు స్కూళ్లలో ఎల్‌కేజీ నుంచే బోధన మొదలవుతుది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ప్రాథమికస్థాయి నుంచే కనీసం రెండో తరగతి నుంచే హిందీ బోధన అమలు చేయాలి.
- ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ ప్లస్(జూనియర్ కాలేజీల) స్థాయి వరకు అన్ని పాఠశాలల్లో మిగతా సబ్జెక్టులతో సమానంగా హిందీ పండిట్ పోస్టులను భర్తీ చేయాలి.
- మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలు, హైస్కూల్ ప్లస్, జూనియర్ కాలేజీల్లో పీజీటీ హిందీ/లెక్చరర్ పోస్టులను మంజూరు చేయాలి.
- హిందీ పండిత శిక్షణా కళాశాలలను తక్షణమే ప్రారంభించాలి. వేలాది మంది హిందీ పట్టభద్రులు రాష్ట్రంలో హిందీ పండిట్ ట్రైనింగ్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.
- ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో హిందీ ద్వితీయ భాషగా హిందీ అధ్యయనాన్ని ప్రోత్సహించాలి.
- రాబోయే డీఎస్సీలో హిందీ పండిట్ పోస్టుల సంఖ్యను పెంచాలి.
- 6 నుంచి 10వ తరగతి వరకు హిందీ పాఠ్యపుస్తకాలను సరళంగా మార్చాలి. త్రిభాషా సూత్రాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలి.
- 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఎల్పీసెట్(భాషా హిందీ ప్రవేశపరీక్ష) ద్వారా హిందీ పండిత శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి.

ప్రాథమికస్థాయి నుంచే హిందీబోధన జరగాలి..



ప్రైవేటు స్కూళ్లలో నర్సరీ నుంచే హిందీ బోధన సాగుతోంది. ప్రభుత్వ స్కూళ్లలో అలా జరగడం లేదు. కనీసం 2, 3వ తరగతుల నుంచైనా హిందీ బోధన మొదలుకావాలి. ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు, హిందీ భాషాపండితులను నియమించాలి. డీఎస్సీ ద్వారా హిందీ పండిట్‌పోస్టులను పెద్దఎత్తున భర్తీ చేయాలి.

– కోనే శ్రీధర్, ఉత్తరాంధ్ర సమన్వయకర్త, హిందీ మంచ్

తగిన గుర్తింపు లేదు..



హిందీ భాషాభివృద్ధికి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు మరింతగా ప్రోత్సహించాలి. జాతీయ భాషగా హిందీకి తగిన గుర్తింపు ఇప్పటికీ లభించలేదనే చెప్పాలి. హిందీ భాషాభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటు అందించకపోతే మా గోడు ఎవరికి చెప్పుకోవాలి. వేలాది మంది హిందీ పట్టభద్రులు పండిట్ ట్రైనింగ్ కోసం నిరీక్షిస్తున్నారు.

– కనుగుల సత్యం, జిల్లా అధ్యక్షుడు, హిందీ మంచ్

జాతీయ సమైక్యత కోసం..



హిందీ మన దేశ జాతీయ భాష. జాతీయ సమైక్యతను ఇనుమడింపజేసే భాష హిందీయే. రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలో హిందీకి 17 సెక్షన్ల తర్వాతే రెండో పోస్టును భర్తీ చేస్తుండటం తగదు. ఇది తీరని అన్యాయం. హిందీ లెక్చరర్లను నియమించాలి. పదోన్నతులతో భర్తీచేయాలి.

– ఇమ్మిడిశెట్టి సంతోష్‌కుమార్, హిందీ ఫోరం జిల్లా కన్వీనర్

దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ

- సిక్కోలు నుంచే తిరుగుబాటు ఆరంభం కావాలి
- వైఎస్సార్‌సీపీ దళిత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళితుల ఓట్లు, సీట్లు మాత్రమే సీఎం చంద్రబాబుకు కావాలని, వారి సంక్షేమం అవసరం లేదని వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ మండిపడ్డారు. దళితులంటే టీడీపీకి ఎప్పుడు చిన్నచూపేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దళితులంతా ఏకతాటిపైకి రావాలని కోరుతూ ఈ నెల 17న వైఎస్సార్ సీపీ దళిత విభాగం ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో బృందావనంలో జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని దళిత యువత, ఉద్యోగ, నిరుద్యోగ, పలు విభాగాల నాయకులతో పాటు దళిత జాతి అంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, అన్ని నియోజకవర్గవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొని దళితులకు అండగా నిలవాలని కోరారు. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి మాట్లాడుతూ మనిషిగా పుట్టాలనుకునే వాడు దళితుల్లో పుట్టాలనుకుంటారా అని మాట్లాడిన నీచ సంస్కృతి చంద్రబాబుదన్నారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర మంత్రులున్నా దళితులకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. దళితులకు యూరియా ఇవ్వకుండా కేవలం టీడీపీ నేతలే పంచుకుంటున్నారని దుయ్యబట్టారు. దౌర్జన్యంగా రేషన్‌డిపోల డీలర్లను తొలగించేశారన్నారు. కూటమి నేతలపై దళితుల తిరుగుబాటు శ్రీకాకుళం జిల్లా నుంచే మొదలవుతుందన్నారు.

ప్రతి గ్రామం నుంచి ఈ నెల 17న జరిగే సమావేశానికి హాజరుకావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి, నియోజకవర్గ ఇన్‌చార్జి యజ్జల గురుమూర్తిలు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేసి దళితుల జీవితాలతో ఆడుకోవడం సరికాదన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలోనూ, శ్రీకాకుళం జిల్లాలో సౌమ్య, గతంలో కొరపాన కళ్యాణి అనే ఉద్యోగినులపైనా టీడీపీ నేతలు దాడులు, వేధింపులకు పాల్పడ్డారని గుర్తు చేశారు. వీటిని అరికట్టాలంటే దళితులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ దళిత విభాగం నాయకులు లక్ష్మణరావు, రామినాయుడు, గడ్డయ్య, నీలాపు ముకుందరావు, జలగడుగుల శ్రీనివాస్, నల్లబారికి శ్రీనివాసరావు, త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహభావం పెంపొందించేందుకు కృషి


ప్రమాణస్వీకారం చేస్తున్న ఇస్కాఫ్ నూతన కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజల మధ్య స్నేహభావం పెంపొందించడమే ఇస్కాఫ్(భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం) లక్ష్యమని సంస్థ ప్రతినిధి మల్లేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోవిట్ యూనియన్ పతనం తర్వాత భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం ఇస్కాఫ్‌గా మారిందన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి తోడ్పడటం, ఆర్థిక సంక్షోభాలను అధిగమించడం, ఇరుగుపొరుగు దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు పెంపొందించేందుకు ఇస్కాఫ్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బుడుమూరు శ్రీరామమూర్తి, గౌరవ సలహాదారుడిగా గేదెల ఇందిరా ప్రసాద్, జిల్లా అధ్యక్షుడిగా బుడుమూరు వెంకట సూర్యనారాయణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.వి.నాగభూషణరావు, కార్యదర్శిగా గురుగుబెల్లి రాజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా సీపాన రామారావు, టి.కామేశ్వరి, సనపల నారాయణరావు, సాహుకారి నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శులుగా గేదెల లక్ష్మి, టి.తిరుపతిరావు, సాదు కామేశ్వరరావు, దిబ్బ ప్రసాదరావు, కోశాధికారిగా కె.భాస్కరరావు, కార్యవర్గ సభ్యులుగా నాగేశ్వరరావు, ఈశ్వరరావు, చౌదరి సత్యనారాయణ, వద్దాది విజయకుమార్, కుంచి చిన్నారావు, టి.వి.రమణ, తంగి యర్రమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పెచ్చులూడిన పోస్టాఫీసు పైకప్పు


బయటకు కనిపిస్తున్న ఇనుప చువ్వలు


కుర్చీలపై ఊడిపడిన శ్లాబ్‌ముక్కలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని పోస్టాఫీసు పైకప్పు పెచ్చులూడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఖాతాదారులు పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. తొలుత చిన్న చిన్న ముక్కలు పైకప్పు నుంచి రాలుతుండడం గమనించి భయపడి బయటకు వెళ్లిపోవడంతో ముప్పు తప్పింది. ఓ ఖాతాదారుని భుజంపై పెచ్చు పడడంతో స్వల్పంగా గాయమైంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది సైతం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

తూర్పుకాపుల ఐక్యత చాటిచెప్పాలి


తూర్పుకాపు ఉద్యోగులను సత్కరించిన సంఘ నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పుకాపుల ఐక్యతను చాటిచెప్పాలని సంఘ నేతలు పిలుపునిచ్చారు. తూర్పుకాపులో ఉద్యోగులుగా ఉంటూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని శనివారం శ్రీకాకుళం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సన్మానించారు. సత్కారం అందుకున్న వారిలో రిటైర్డ్ ఎంఈఓ గెడ్డాపు రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ హెచ్‌ఎం దాసరి రామచంద్ర, బోడసింగి ఖగేశ్వరరావు, మెంటాడ సాంబమూర్తి, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బౌరోతు శంకరరావు, హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన మక్కా శ్రీనివాసరావు, మీసాల శ్రీనివాసరావు, తలగాన లింగరాజు, కిల్లాన రాంబాబు, రాజాపు శ్రీనివారావు, కర్నేన రమణమూర్తి, గొంటి తిరుపతిరావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు బాదాన రాజు, శిష్టి వెంకటరావ్, ప్రధానోపాధ్యాయులు చెల్లి వెంకటరమణ, ఉపాధ్యాయుడు లెంక చక్రపాణి, ఉద్యోగ సంఘాల నేత కిల్లారి నారాయణరావు, వాల్తేటి సత్యనారాయణ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు రాడ కైలాసరావు, శాసపు జోగినాయుడు, వాన కృష్ణచంద్, మామిడి క్రాంతి, గొర్లె వాసుదేవరావు, తూర్పు కాపు ఉద్యోగ సంఘాల నేతలు పడాల తమ్మినాయుడు, వాళ్ళ శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం


మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ అమలుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ పోస్టు కార్డు ఉద్యమం చేపడుతున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవనంలో శనివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఐదేళ్లకోసారి వేతన సవరణ అమలు చేయాల్సి ఉందని, 11వ వేతన సవరణ గడువు 2023 జూలై 1 నాటికి ముగిసినా ఇప్పటివరకు పీఆర్‌సీ బకాయిలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కమిటీ వేయకపోవడం విచారకరమన్నారు.

కనీసం ఐఆర్ కూడా ప్రకటించలేదన్నారు. పెండింగ్ బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. జిల్లాలో 471 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు దూరప్రాంతాల్లో పనిచేస్తున్నారని, వారికి ఇంటి అద్దె అలవెన్స్ ఇస్తే కొంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో సంఘ ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, గురువు శ్రీనివాసరావు, డీవీఎస్ పట్నాయక్, ఎస్.రామచంద్రరావు, జి.తిరుమలరావు, ఎం.మురళీధర్, బి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బదులు గడ్డి మందు తాగి..


ప్రభాకరరావు (ఫైల్)

బూర్జ: మద్యం మత్తులో గడ్డి మందు తాగిన బూర్జ మండలం తోటవాడ పంచాయతీ టి.ఆర్. రాజుపేటకు చెందిన కొంగరాపు ప్రభాకరరావు (45) శనివారం మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకరరావు మద్యానికి బానిసయ్యాడు. గురువారం వేకువజామున బాటిల్ తేడా గమనించక గడ్డి మందు తాగాడు. శుక్రవారం ఉదయం వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు గమనించి 108 అంబులెన్సులో శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించే ప్రభాకరరావుకు భార్య కేసరమ్మ, కుమారుడు దుర్గాప్రసాద్, వివాహమైన కుమార్తె ఉన్నారు. కేసరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులతో మోహన్, కోచ్‌లు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలోని మార్షల్ ఆర్ట్స్ అకాడమికి చెందిన పలువురు బాక్సింగ్ క్రీడాకారులు ఈ నెల 14న విశాఖ ఆంధ్రా విశ్వవిద్యాలయం వేదికా జరిగే రాష్ట్రస్థాయి మహిళా కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్ శనివారం అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ వై.హేమంత్‌కుమార్, కోచ్ డి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులకు నెలవు ఉద్దానం


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి అజశర్మ

పలాస: ఉద్దానం ప్రాంతంలో అపారమైన ప్రకృతి వనరులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ చెప్పారు. 'ఉద్దానం ప్రాంత అభివృద్ధి ,అవకాశాలు, అవరోధాలు' అనే అంశంపై కాశీబుగ్గలో శనివారం వివిధ ప్రజాసంఘాల నాయకులు, మేధావులతో రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక ప్రతినిధి జుత్తు సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అజశర్మ మాట్లాడుతూ చిత్తడి నేలలు, సముద్రతీరం, ఉద్యాన పంటలు, సారవంతమైన భూమి వంటి ప్రకృతి వనరులను కాపాడుకోవాలన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, 80కిలోల బస్తాకు రూ.16వేలు చెల్లించాలని, వాటిని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీడి బోర్డుతో పాటు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కొబ్బరి బోర్డు, జీడి కొబ్బరి నార సహకార పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యాన పంటలకు ఉచితంగా ఎరువులు, పురుగుల మందులను సరఫరా చేయాలని కోరారు. కిడ్నీ వ్యాధి నిర్మూలనకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వంశధార ప్రాజెక్టు ద్వారా శివారు భూములకు నీరందించాలన్నారు. మత్స్యకారులకు ఉపాధితో పాటు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కొత్తకోట అప్పారావు, పాలవలస ధర్మారావు, డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు, తెప్పల అజయ్‌కుమార్, కె.హేమారావు చౌదరి, కూన వెంకటరావు, గోపాలకృష్ణ, బద్రి కూర్మారావు, పోతనపల్లి గీతమ్మ, కుత్తు వినోద్, దేవేంద్ర వర్మ, జానకి రామయ్య, కొమర వాసు, బాబూరావు, గణేష్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.